



# పొలిమేర దాటెళ్ళిపోయింది



రాజమండ్రినించి భద్రాచలంవెళ్తుంటే పాపికొండలకి ముందు కుడిపక్క తగిలే కొండమొదలు అనే ఊళ్ళో టీచరు ఉజ్జోగం చేస్తున్నాడు చినశంకరం.

సంక్రాంతి నెలపట్టి మూడువారాలు దాటేసింది. పండక్కి రమ్మని ఉత్తరం వచ్చింది అత్తారి ఊరయిన పసలపూడినించి. భార్య విమలకూడా అక్కడే ఉంది. దాంతో రెండు మూడు రోజులు ముందే బయలు దేరిపోవాలని అనేసుకున్నాడు కొత్తగా పెళ్ళయిన చినశంకరం.

* * *



అప్పుడే తెల్లవారుతుంది. ఆకాశం ఎత్తులో ఎదురుగా కనిపిస్తున్న పాపికొండల మీంచి సుళ్ళు తిరుగుతా వీస్తుంది కొండ గాలి. ఇటు కొండమొదల్లో జాలరోళ్ళు, అవతల శిరువాకలో ఉన్న జాలరోళ్ళు కలిసి గోదార్ని ఎడాపెడా పంచుకుని వేసుకున్న వలల మీద ఇలాయి బుడ్లు మినుకుమినుకు మంటా వెలుగుతున్నాయి.

మిలట్రీరంగు ట్రంకుపెట్టితో ఆ రేవులో కొచ్చాడు చినశంకరం. భద్రాచలం నించి రావాల్సిన మన్యంరాణి పేరుగల లాంచీ ఇంకా రాలేదు. ట్రంకుపెట్టి నేలమీద పెట్టి రేవులోకెళ్ళి దోసిట్నిండా నీళ్ళు తీసుకుని తాగేసి వచ్చేడు. ''ఇక్కడిగాలిలోనూ, మట్టిలోనూ, నీళ్ళలోనూ ఎందులోనూ కల్తీలేదు పవిత్రమైన ఆ గోదావరి మాత నివాసం ఇక్కడే గదా'' అనుకుంటుండగా డబ్ డబ్ మంటా లాంచీ వస్తున్న చప్పుళ్ళు వినిపించినియ్యి. గాలి బాగా పెరిగింది. కదుల్తా చప్పుడు చేస్తున్నాయి నీళ్ళు.

రేవులోకొచ్చి ఆగింది మన్యంరాణి అన్న పేరు గల లాంచి. సరంగు తోగుమ్మి బాలయ్య గెడెయ్యడానికి ముందే గట్టు మీంచి పెట్టితో పాటే అమాంతంగా ఎగురుకుంటా లాంచీలోకి దూకేసేడు చినశంకరం.

లాంచీ లోపల ఓనరు పాదం రవణమూర్తితో ''టికెట్టు రాజమండ్రికి'' అని చెప్పి కేవు ఇచ్చి ఆయిలు మరకల్తో ఉన్న బల్లమీద జరిగి కూర్చున్నాడు.

ఆవేళ భద్రాచలంలో ఆడొస్తున్న రాజమండ్రి పౌరాణిక నాటకాల ట్రూపోళ్ళతో నిండిపోయింది లాంచీ. ఎండు మిరపగాయల బస్తాలూ, చింతపండు బుట్టలూ, అరిటిగెలలూ, ఎవరో పాటకపు పెళ్ళోళ్ళ గుంపుతో నిండిపోయి ఉంది లాంచీ టాపు. దానిమీదికి కాస్సేపున్నాకా పైకెళ్ళొచ్చులే అనుకుని లోపలే సర్దుకున్నాడు.

''ఎందాకా?'' అడిగేడు నాటకాల ట్రూపు కాంట్రాక్టరు పాపారావు.

చెప్పేడు చినశంకరం.

''అరె పసలపూళ్ళో ప్రతి గణపతి నవరాత్రులకీ ప్రోగ్రామ్సు చేస్తుంటాం గదా? అవి చేయించే రెడ్డిగారింట్లో భోజనం ఒకసారి చేస్తే మర్చిపోలేవండి ఒక్కసారి వారిలోగిట్లో భోంచేసి చెయ్యికడుక్కుని చచ్చిపోవచ్చు. అంత గొప్ప రుసి అంత గొప్ప జనం అంత గొప్ప ఊరు'' అంటా చాలా చెప్పుకుపోతున్న కాంట్రాక్టరు ''ఆవూరి గురించి ఇంకా చాలా తెలుసండి అబ్బాయిగారు... ఎందుకంటారేమో ఎన్నేళ్ళనించో ప్రోగ్రామ్సు లాడుతున్నావండి పసలపూడిలో...'' అంటా ఇంకా చాలా మాటాడుకుంటా పోతుంటే సంబరంగా అతన్నే చూస్తున్నాడు చినశంకరం.

* * *

కాలవగట్టు దగ్గరాగిన బస్సులోంచి దిగిన చినశంకరం ట్రంకు పెట్టి పట్టుకుని దిగువలో ఉన్న వూళ్ళోకి నడక మొదలెట్టేడు.

రథం ముగ్గులు, మల్లెపందిరి ముగ్గులు, ఏనుగుపాదం ముగ్గులు ఒకటేంటి రకరకాల ముగ్గులు ఒంచిన నడుం ఎత్తకండా నడవడానికి పిసరంత సందులేకండా ముగ్గు లేసేస్తున్నారు ఆడపిల్లలు. చిన్నచిన్న సందులన్నీ కల తిరిగిన హరిదాసు బ్రహ్మయ్యగారి వీధిలో కొచ్చేసరికి చిన్న పిల్లలంతా కల్సిదండ కట్టేసేరు. రెడ్ల ఇళ్ళకి పెరుగులకీ పాలకీ వెళ్తున్న చిన్న కులాల పిల్లలు గోపాలస్వామి గుడి గోడ పక్కన రాలిన పారిజాతం పూలు ఏరుకుంటున్నారు. చింతపిక్కరంగు ఎత్తయిన గచ్చు అరుగులూ, బర్మాటేకు స్తంభాలు ద్వారబంధాలకి ఎడాపెడా జక్కం వీరన్నలాంటి వడ్రంగి శిల్పులు చెక్కిన నెమళ్ళు, తొండాలు పైకెత్తి నీళ్ళు చిమ్ముతున్న ఏనుగుల బొమ్మలతో నిండి ఉన్నాయి. ఇక వైభోగంతో వెలిగిపోతున్న మండువాలోగిళ్ళు అద్దాలమేడలు గాలిమేడలూ సరేసరి.

అత్తారింటి ముందు కొచ్చేటప్పటికి బామ్మరుదులూ మరదళ్ళూ చుట్టూ మూగేసేరు. పాలేరు అప్పన్నొచ్చి బెడ్డింగూ ట్రంకుపెట్టి లోపలికి పట్టుకుపోయేడు. మామగారు మంచీ చెడ్డా అడుగుతుంటే కాళ్ళు కడుక్కోమని కూజా బిందెడు నీళ్ళు తెచ్చింది అత్తగారు. తలుపు వెనక నిలబడున్న భార్య విమల ఆ సందులోంచే నవ్వుతా టపటపలాడిస్తుంది తన వెడల్పాటి కంటి రెప్పలు.

మధ్యాన్నం,

గోర్మిటీలూ, బెల్లంపూతరేకులూ, పాలపూరీలు, పాకుండలూ రకరకాల పిండి వంటలు. దబ్బకాయ పులిహోరా, ఆవపెట్టిన అరిటిపువ్వుకూర, పనసపొట్టుకూర, కంది పచ్చటి, అత్తగారలా కూరేస్తుంటే ఎక్కిసం అయిపోయినా మొత్తానికెలాగో లాగించి పందిరిపట్టి మంచం ఎక్కి పడుకున్న మనిషి తిరిగి లేచేసరికి చీకటి పడిపోయింది.

కందికంపతో కట్టిన స్నానాలదడిలో కెళ్ళి వేడినీళ్ళు నెత్తిమీద దిమ్మరించుకుంటుంటే ఆ శీతాకాలం రాత్రి చెప్పలేనంత హాయిగా ఉంది. ఎన్ని చెంబుల నీళ్ళు పోసుకున్నాడో.

స్నానం అయ్యాక, బట్టలేసుకుని చలిగాలిలో అలాగ పంచాయితీ ఆఫీసు వేపెళ్తుంటే, రాములోరిగుడి అరుగుల మీద కూర్చున్న ఊళ్ళో పెద్దోళ్ళు సిల్లోబొల్లోమంటా చిన్న పిల్లలు సందడిసందడిగా ఉంది. ఈలోగా పంచాయితీ బోర్డు ఆఫీసు స్తంభానికి కట్టిన స్పీకర్లోంచి వార్తలొస్తున్నాయి. ఊరి మొత్తానికి ఒకటే రేడియో.

‘‘ఎంత అందంగా ఉందీ ఊరు. ఎక్కడ చూసినా ఎంత సంబరంగా ఉందీ ఊరు’’అనుకుంటా నడుస్తున్నాడు చినశంకరం.

* * *

భోగి ఆవేళ. ‘‘ఒకసారి విమలా నేనూ కల్సి మా చిన్నక్కయ్యగారి ఊరు వెళ్ళొస్తావండి’’ అన్నాడు చినశంకరం.

‘‘ముక్కనుమ తర్వాత వెళ్ళగూడదా?’’ అన్నాడు మామ నర్సిమ్మూర్తిగారు.

‘‘మళ్ళా దీపాలవేళకి వచ్చేస్తాం లెండి’’ అని భార్యతో బయల్దేరుతుంటే మాసిపోయిన గుడ్డల మూటట్టుకుని వస్తున్న బూరయ్య పెళ్ళాన్ని కాస్త ఎదురు రమ్మంది అత్తగారు సీతారావమ్మ.

కాలవ దగ్గర కొచ్చాక రేవులో ఆగున్న గూటి పడవ ఎక్కి ‘‘పెడపర్తిరేవుకి’’ అని కేవు ఇచ్చేడు.

వెడల్పాటి ఆ గోదావరి కాలవలో గూటి పడవ నెమ్మదిగా వెళ్తుంటే కాలవకి ఎడాపెడా పచ్చటి వేప చెట్లు, మామిడిచెట్లు, గానుగచెట్లు నిద్రగన్నేరు చెట్లూ, ఏ పక్కకి చూసినా పచ్చదనం. దూరంగా ఎక్కడో పొలాల్లో తాటాకు గుడిశలు వాటి కొప్పుల్లోంచి వస్తున్న పొగ, పులగుర్త రేవు దగ్గర కొత్త బట్టలు కట్టుకున్న నలుగురు ఆడపిల్లలు మొన్నే వండిన కొత్త బెల్లంతో చేసిన పరమాన్నం, బూర్లూ, ఇత్తడి గిన్నెల్లో పెట్టుకుని వాటి మీద అరిటాకు ముక్కలు కప్పుకుని వయ్యారంగా నడుచుకుంటా వెళ్తున్నారు. వాళ్ళనే చూస్తున్న చినశంకరం ‘‘అవి తీసుకుని వాళ్ళెక్కడి కెళ్తున్నారంటావ్?’’ అన్నాడు.

‘‘బంధువులిళ్ళకి... వాళ్ళు వండుకున్నవి వీళ్ళకి కూడా పంపిస్తారు’’ అంది విమల.

ఇంకొంచెం ముందుకెళ్ళేక ‘‘ఒహోం... ఒహోం’’ అన్న కేకలు వినిపించినియ్యి.

ఆడోళ్ళని పల్లకి ఎక్కించుకున్న బోయీలు మోసుకెళ్తున్నారు వెడల్పాటి పొలంగట్లమీంచి.

పెడపర్తి రేవులో ఆగింది గూటి పడవ.

అక్కడ్నించి జట్కా ఎక్కి ఊళ్ళోఉన్న చిన్నక్క ఇంటికెళ్ళాడు.

ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టిన అరుగులు. పసుపు రాసి బొట్లెట్టిన గడపలు మామిడాకుల తోరణాలు కట్టిన ద్వారబంధాలు, సాంప్రదాయంతో కళకళలాడుతుంది ఊరు. కాళ్ళు కడుక్కోడానికి పాలేరుతో ఇత్తడి గంగాళంచెంబు పెట్టించింది వాళ్ళ చిన్నక్క చిలక్కొయ్యకి తగిలించున్న గళ్ళ తువ్వాలందించాడు బావ.

లోపలికొస్తున్న వాళ్ళిద్దర్నీ కూర్చోమని రెండు ముక్కాలి పీటలు వేసారు.

కాస్సేపయ్యాకా ‘‘పక్కనే ఉన్న రామవరంలో ఉన్న పెద్దక్కని కూడా చూసిరా బాగోదు’’ అంది చిన్నక్క.

సవ్వారీబండి సిద్ధం చేసేడు బావ.

ఎక్కకుండా అలా చూడబుద్దేస్తుంది ఆ సవ్వారీ బండిని. ఆరోగ్యంగా ఎత్తుగా ఉన్న ఎద్దులకాళ్ళకి గజ్జలూ, మెళ్ళో గంటలూ, మోపురం చుట్టూ భుజాలకి రంగు రంగుల రిబ్బన్లూ కట్టారు. ఒంపు తిరిగున్న ఎద్దుకొమ్ముల మొసాలకి కంచు రింగులు తొడిగేరు. బండిలోపల దళసరి జమ్ఖానాలు పరిచారు.

''మరి వేళవుతుంది బయల్దేరండి'' అని చిన్నక్కనేసరికి ఆ బండెక్కారు.

ఘల్ ఘల్ మంటా బలభద్రపురం ఎర్రకంకర దుమ్ము లేపుకుంటా పచ్చా పచ్చని చెట్ల నీడల్లో ఉన్న పెడపర్తి దాటి కుతుకులూరు చెరువు మీదుగా ఆ సవ్వారీ బండి వెళ్తుంటే అత్తారిళ్ళకి ఆలశ్యంగా వస్తున్న కొత్త పెళ్ళికొడుకులు అప్పుడే జట్కా బళ్ళు దిగుతున్నారు. పొరుగూరు అల్లుళ్ళయిన ఆవూరి కుర్రోళ్ళు సుబ్బరంగా కడిగి ఆయిలు పెట్టిన సైకిళ్ళ ఊచలకి మామిడాకులు కట్టి పాటలు పాడుకుంటా పోతున్నారు. సారె నింపిన ఇత్తడి బిందెలకి పసుపుగుడ్డలు కట్టి వాటిని కావిళ్ళలో పెట్టి ఆవూర్నుంచి పొరుగూరికి పరుగులాంటి నడకతో మోసుకుపోతున్నారు. రామవరం ఊళ్ళోకి రాగానే వెలుగుతున్న భోగిమంటలు దాటుకుంటూ, తెలుకులగానుగ పాక దాటుకుంటూ చినశంకరంగారి పెద్దక్కయ్య ఇంటి దగ్గరాగింది సవ్వారిబండి.

ఆ ఇంటి ముందు ఒకటే జనం.

వాళ్ళ మధ్యలో ఊరి ప్రెసిడెంటు నల్లమిల్లి పద్దయ్యరెడ్డిగారు. ఆయన పక్కన చినశంకరం పెద్దబావ. ఆవూళ్ళో ఆయన్ది పోస్టుమేస్టరుజ్జోగం. పోస్టాఫీసు వీధరుగు మీద గదిలో ఉంది.

తెల్లవారుఝాముున వూరికుర్రోళ్ళు దొంగతనంగా తలుపులు బద్దలుకొట్టి పోస్టాఫీసులో టేబులూ కుర్చీ భోగిమంటలో పారేసారట. వాళ్ళెవరో తేలక తల పట్టుకున్న ప్రెసిడెంటుగారికి నవ్వూ ఏడుపూ కలిపొచ్చేస్తున్నాయి.

బండి దిగిన చిన శంకరాన్ని చూసి అన్నీ మర్చిపోయిన పెద బావ లోపలికి తీసుకెళ్ళాడు. ఇద్దరికీ తలంటు పోసి పట్టుబట్టలూ పండగ భోజనం పెట్టింది పెద్దక్క.

* * *

ఇంతసేపూ చెప్పింది నిన్నా మొన్నటి కథగాదు. ఎప్పటిదో అసలు ముసలోడయిన చినశంకరంగారు కాలం చేసే నాటికి నేను పుట్టేలేదు. ఇదంతా పెద్దోళ్ళెవరో చెపితే విన్న కథ. అందమైన ఆనాటి అందమైన చినశంకరంగారి జీవితాన్నీ అందమైన మా కాలవ కింద పల్లెటూళ్ళని వాటి మధ్యలో మరీ అందమైన పసలపూడిగ్రామాన్నీ చెక్కు చెదరని సాంప్రదాయాల్నీ, కట్టుబాట్లనీ, మావాళ్ళ అమాయకత్వాన్నీ మానవ సంబంధాల్నీ హాయిగా నెమరేసుకుంటా చాలా ఏళ్ళ తర్వాత ఊళ్ళోకి దిగేను.

నడుస్తుంటే సుబ్బారాయుడు గుడి దగ్గర ఎదురైన ఆదియ్య నన్ను గుర్తుపట్టి పలకరించేడు. బుర్రకథ దళంలో హాస్యం చెపుతాడతను. బాగా ఒంగిపోయిన అతన్ని చూస్తా ''ఇప్పుడు చెప్పడం లేదా బుర్రకథలు?'' అనడిగితే బాధగా నవ్వుతా ''ఇప్పుడు మన కథలు ఇనే జనం ఏరి అబ్బుగారూ?'' అంటా ఒకప్పుడు హరికథలూ, బుర్రకథలూ, పౌరాణిక నాటకాలూ కాలక్రమేణా అయ్యన్నీ పోయి తర్వాత విడియో కేసెట్లూ టీవీలు. ఆ ప్రోగ్రామ్సన్నీ చూస్తున్న జనాల్లో రకరకాల మార్పులండీ అంటూ బాధగా గతకాలాన్ని తల్చుకుంటుంటే మా పక్క నించెళ్తున్న మిషనుకుట్టు త్యాగరాజుగాడు నన్ను చూసి సైకిలు దిగి పలకరించేడు. నవ్వుతా ఆడిభుజం మీద చెయ్యేసేను. ఆ మాటా ఈమాట అయ్యేక ''మన చిన్నప్పటి స్నేహితుడు అదేరా మనకంటే చాలా పెద్దోడు కోనాలోళ్ళ రాజు ఎలాగున్నాడు?'' అన్నాను.

''ఇద్దరు మగపిల్లలు ఆడికి. పెళ్ళిళ్ళు చేసేసేడు. ఆ కొడుకులు ఆళ్ళ పెళ్ళాం పిల్లలు తప్ప రాజునిగానీ నీరుడు జబ్బుతో బాధపడే వాళ్ళావిడ్నిగానీ చూడ్డం లేదు ఇక కోడళ్ళయితే ఈ అత్తమావలు ఎప్పుడొదుల్తారా అన్నట్టున్నారు'' అన్నాడు.

''ఇలాంటి మనుషులు ఇంతకు ముందు మనూళ్ళో లేరే''.

''ఇప్పుడు వూర్నిండా ఇలాంటోళ్ళే. మొన్నా మధ్య దేవాంగుల పేటలో బళ్ళ బాలసుబ్రమణ్యంగారు పోతే శవం నట్టింట్లో ఉండగానే ఆస్తి గురించి కొట్టుకు చచ్చేరంట వాళ్ళ పిల్లలు... ఆనాటి సంబందాలిప్పుడు లేవు'' అన్నాడు.

ముందుకి నడుస్తున్నాం.

చుడీదార్లూ మిడీలు వేసుకున్న ఇద్దరుపిల్లలు కెనటిక్ హోండా వెనకాలెక్కి మాముందు నించెళ్ళేరు. గోపాలస్వామి గుళ్ళో పూజారిగారి కోడలు నైటీ వేసుకుని నారంజకాయల సైకిలోడితో బేరమాడుతూ ఈలోగా తేగలకట్ల తట్ట మనిషెళ్తుంటే దాన్ని పిలుస్తుంది స్టైలుగా.

ఆ మనిషిని చూస్తున్న నాతో ''రోజులు చాలా మారిపోయినియ్యి ఆ కట్టు ఆ బొట్టు ఇప్పుడు కనపడదు పద'' అని కదిలేడు త్యాగరాజు.

వాడ్రేవు భానుమూర్తిగారి మండువాలోగిలంతా ఖాళీగా ఉంది. బాగా ముసల్దయిపోయిన భానుమూర్తిగారి పెదక్క వెంకాయమ్మగారు మట్టుకి అరుగుమూల కూర్చుని ఏ కళాలేని గాజుకళ్ళతో వెళ్తున్నది ఎవరా అన్నట్టు జూస్తుంది మమ్మల్ని. ఒకప్పుడు ఎంత కళకళలాడేది ఈలోగిలి అంటున్న నాతో ''భానుమూర్తిగారు పోయేక ఫేమిలీలో జనం మొత్తం హైదరాబాదెళ్ళిపోయేరు. అసలు జనం ఊళ్ళో ఉండడం లేదు. పిల్లలు చదువులకన్నీ, ఉజ్జోగాలకనీ వలస పోతున్నారు. పెరుగుతున్న జనాబావల్ల ఈ మాత్రం జనంతో ఉందీ ఊరు'' అన్నాడు ఆదియ్య.

ఊళ్ళో ఏ పక్క జూసినా కెనటిక్ హోండాలూ, స్లెండర్లూ కనపడ్తున్నాయి. నడుస్తున్న మా పక్కనించి ఒక ఇండికాకారు స్పీడుగా వెళ్ళిపోతే క్వాలిస్ దానికి ఎదురొచ్చింది. ''ఇప్పుడు జట్కాలూ సవ్వారీ బళ్ళు లేవు గదా?'' అంటే ''ఏకాలంలో ఉన్నావురా బాబూ'' అంటా నవ్వేసేడు త్యాగరాజుగాడు.

''పూర్వం పండగరోజులొస్తే పొద్దుటే పుంతరేవు దగ్గర నీళ్ళల్లో దిగుతా ఎంతమంది జనం ఉండేవారు...ఇప్పుడు ఇళ్ళలో కట్టుకున్న బాత్‌రూముల్లోనే స్నానాలు. ఆడోళ్ళు ముఖాలకి పసుపు రాసుకోడం లేదిప్పుడు రకరకాల క్రీములు, కొంకిడికాయలకి బదులు షాంపూలు చూసేవుగా పూజారిగారి కోడల్ని'' అన్నాడు త్యాగరాజు.

సంతపేటలో ఒకప్పుడు ధాన్యం మిల్లుండేచోటు ఇప్పుడు ఖాళీగా ఎత్తుగా పచ్చగడ్డి మొలిచి ఉంది. మాసిన పంజాబీడ్రస్సు వేసుకున్న ఒక పిల్ల రెండు గేదెల్ని అక్కడ మేపుతా గొల్లలతూము దగ్గర ఎవరో పాతిల్లు పడగొట్టి మోడ్రన్ బిల్డింగ్ కట్టుకున్నారు. ఆవేళ గృహప్రవేశం అనుకుంటాను. వరసగా టేబుల్స్ వేసి ఉన్నాయి. కూర్చుని భోంచేస్తున్న జనాల ముందుకి అన్నం గిన్నెతో వచ్చిన కుర్రాడు ''కొంచెం వైట్‌రైస్ వడ్డించమంటారా?'' అంటున్నాడు. భాషలో ఎంత మార్పు? అనుకుంటుండగా, ఆ జనాల్లోంచి అప్పుడే భోంచేసి బయటికొస్తున్న చింతా సుబ్బారెడ్డిగారూ విశ్వనాధరెడ్డిగారూ నన్ను జూసి వాళ్ళ మేడలోకి రమ్మన్నారు. వాళ్ళకూడా వెళ్తున్నాను. మేస్త్రి వీరాస్వామిగారింటి ముందు బాకా మట్టుకి ఊదుతూ కనపడ్డ గంగిరెడ్ల వాడి పక్కన ఎద్దులేదు. ''ఎందుకు'' అంటే ''మాకే గడవడానికి కష్టంగా వుంటే ఇకదాన్నెక్కడ మేపం బాబయ్యా?'' అని ఎదురడిగేడు. అతన్నే చూస్తా ఉండిపోయిన నాతో ''తోలు బొమ్మలాటోళ్ళు దొమ్మరాటోళ్ళూ మన విశ్వనాధంగారి పొలంలోకి కూలి కొచ్చేరామధ్య'' అన్నాడు ఆదియ్య.

స్వరాజ్యరెడ్డిగారూ, కర్రెంకయ్యగారూ, కర్రిసుబ్బిరెడ్డిగారూ వాళ్ళబ్బాయి రాముగారూ బ్రాహ్మణరెడ్డి గారిలాంటి వూళ్ళో సందడిచేసే మనుషులంతా కాలం చేసేరంట. ఊరి గత వైభవం గురించి చెప్పుకుంటా పోతుంటే సత్తిసూర్యనారాయణరెడ్డి గారి మనవడు చిట్టిలోపల కొచ్చేడు. చాలా వ్యాపారాలు చేసిన అతను ఇప్పుడొక కొత్తవ్యాపారం చేస్తున్నాడట. చాలా లాభసాటిగా ఉందంట ఆ వ్యాపారం.

ఏంటన్నాను.

"పట్నాలకి పోయినోళ్ళు పోగా ఊళ్ళల్లో మిగిలినోళ్ళు పాతకాలం కోటల్లాంటి గాలిమేడలూ, మండువాలోగిళ్ళు పడగొట్టేసి లేటెస్ట్ టైపు బిల్డింగులు కట్టేసుకుంటన్నార్రా... ఇదిగో ఆదియ్యా...ఆ పాత ఇళ్ళు పడగొట్టి కొత్త బిల్డింగులు కట్టుకుంటున్నప్పుడు ఆ కాలంనాటి పాతసామాన్లేం ఉంటాయో చెప్పు?" అని అడిగేడు.

"చాలా ఉంటాయి గదా. పందిరి పట్టి మంచాలూ, పెద్ద పెద్ద ఇత్తడి గొలుసుల్తో వేళ్ళాడే ఉయ్యాళ్ళు, నెగీషీలూ చెక్కిన ద్వార బంధాలూ, చిలక్కొయ్యాలూ, ముక్కాలి పీటలూ, మర చెంబులూ, ఇత్తడి హారికెన్ లాంతర్లూ భోషాణం పెట్టెలూ...ఇలా చెప్పుకుంటా పోతే చాలా ఉంటాయి" అన్నాడు.

"ఆ సామానంతా గాదుల సావిళ్ళలోనో దొడ్లో ఉన్న పాకల్లోనూ పారేసి లేటెస్ట్ సామాన్లు కొనేసుకుంటన్నారు మనోళ్ళు... నేనా పాతసామాన్లుకొని హైదరాబాదు...మద్రాసూ, ఢిల్లీ ఎక్స్‌పోర్ట్ చేస్తున్నాను...అక్కడ్నించి వాటిల్లో కొన్ని అమెరికా అదీకూడా వెళ్తున్నాయట" అన్నాడు.

అంటే మనదీ అన్పించింది మొత్తం పొలిమేర దాటి వెళ్ళి పోతుందన్నమాట ఇలా పోతే ఒకనాటికి మచ్చుకి కూడా ఏదీ మిగల్దు కదా?

"ఇవ్వేళ రాజేశ్వరస్వామి తీర్థం. గుర్తుందా" అన్నాడు త్యాగరాజు.

"రథం లాగుతుంటారీ పాటికి పదండి" అనేసి కదిలేను.

లక్కపిడతలు, చెక్క బొమ్మలూ అమ్మే దుకాణాలూ, చెక్రం ఆటలూ, గుండాటలూ, రంగులరాట్నం, నువ్వుపప్పు జీళ్ళు, కర్జూరం దుకాణాలూ ఇత్తడిసామాన్లూ, పింగాణీ సామాన్లకొట్లూ తీర్థమధ్యలో చెక్క భజనలు చేసే బాలభక్తసమాజంకుర్రోళ్ళూ...ముఖ్యంగా చుట్టుపక్కల ఊళ్ళనించి సవ్వారీ బళ్ళమీద ఒంటెద్దు బళ్ళమీదా దిగే జనాల్తో సందడి సందడిగా ఇసకేస్తే రాలకుండా ఉండేది రాజేశ్వరస్వామితీర్థం. చంటిపిల్లలు తప్పిపోతే ఆళ్ళు దొరకడానికి టముకు వేయించాల్సి వచ్చేది. అలాంటిది ఈవేళ అక్కడొక్కడూ అకడొకడూ అన్నట్టు పల్చపల్చగా ఉన్నారు జనం. ఆనాటి దుకాణాలూ, ఆ అందచందాలూ మచ్చుకైనా కనపడ్డం లేదు. "ఏంటిలా ఉంది తీర్థం, జనం అసలు లేరేంటి?" అన్నాను.

"ఈ మాత్రం జనవన్నా ఉన్నందుకు చాలా సంతోషించాలి మనం" అన్నాడు త్యాగరాజు.

"ఇవ్వేళ లక్ష్మివారం మనూరి సంత... తీర్థంలో జనం బొత్తిగా లేరని సంతని తీసుకొచ్చి ఇక్కడ కలిపేసేరు వూరిపెద్దలు" అన్నాడు ఆదియ్య.

ఏం మాటాడకండా కాసేపు అలాగే ఉండిపోయిన నేను పల్చని జనం మధ్యలో కనిపిస్తున్న దేవుడి రథం దగ్గర కెళ్ళేను.

దారు శిల్పాలతో నిండిపోయిఉన్న మా రాజేశ్వరస్వామి రథానికి ముందు ఎడాపెడా నాలుగు అంగుళాల కైవారంతో పొడుగ్గా ఉండే ఆ రెండు పెద్దాపురం తాళ్ళనీ చెరో వందేసి మందీ లాగేవారు వెనకటికి. లాగడానికి సంబరపడే చాలా మంది కుర్రోళ్ళు తాడు

లేక మిగిలిపోయేవారు. అలాంటిది

ఇవ్వేళ మా దేవుడి రథం రెండు తాళ్ళనీ వందలమంది జనాలు లాగడానికి బదులుగా ఎర్రరంగు మహేంద్రా ట్రాక్టరు లాగుతుంది. నేనెప్పుడూ ఏడవలేదుగానీ, ఆ దృశ్యం చూస్తున్నప్పుడు మట్టుకి నా కళ్ళల్లోంచి కన్నీళ్ళు జలజలా రాలిపోయినియ్యి.

* * *